సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



పనులు వేగవంతం
పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇళ్ల నిర్మాణాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి కాకాణి ఆదేశించారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.62,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,568
3 శాతం జీఎస్టీతో	రూ.5,735
నవర (8 గ్రా)	రూ.45,880

వాతావరణం
గరిష్టం/కనిష్టం 38.2 /26.3
శనివారం గాలిలో 47 శాతం తేమ ఉంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు ఉండవు. ఆదివారం అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి.



ఇఫ్తార్ ఆదివారం (సా) 6.24
సహర్ సోమవారం (ఉ) 4.34
రంజాన్ వేళలు

ప్రజలకు అండగా ఉన్నాం



మాట్లాడుతున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ ఆదాల, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తదితరులు

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల మద్దతు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): 'సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా ఉన్నాం. అందుకే వారిని ధైర్యంగా కలుస్తున్నాం.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన శనివారం ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రెండు కార్యక్రమాలు పెట్టి చేతులెత్తేసిందన్నారు. తాము గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాల ద్వారా ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నామన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా నేరుగా ప్రజలను కలిసి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలు అందాయా? లేదా? తదితర వివరాలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఈనెల 7వ తేదీన మొదలుపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ఇప్పటికే లక్షలాది కుటుంబాలను కలిశామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా ఇలాంటి కార్యక్రమం చేయలేదన్నారు.

అందరి మద్దతు

అన్ని వర్గాల ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని కాకాణి అన్నారు. సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు కూడా తమ ఇంటికి వైఎస్ జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్లు అతికించుకున్నారని తెలిపారు. చంద్రబాబు పాలనలో ఏ విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయి?, వైఎస్ జగన్ పాలనలో పథకాలను అందిస్తున్న తీరు, హామీలు నెరవేర్చడం తదితర విషయాలను క్లుప్తంగా వివరిస్తూ బుక్‌లెట్లను అందిస్తున్నామన్నారు. కానీ కొన్ని పత్రికల్లో, మీడియాలో తప్పుడు ప్రచారాలు సాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎంతో ఆనందంగా స్టిక్కర్లు అతికించుకున్న వీడియోలను ప్రదర్శించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్, కార్పొరేటర్లు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదాల చొరవతోనే నిధుల విడుదల

నెల్లూరు రూరల్ పరిధిలోని బారాషహీద్ దర్గా అభివృద్ధికి సంబంధించి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చొరవతోనే రూ.15 కోట్లు విడుదలయ్యాయని మంత్రి కాకాణి తెలిపారు. తమ పోరాటాల వల్లే నిధులు విడుదల చేశారని కొందరు అంటున్న మాటలు చూస్తే నవ్వొస్తోందన్నారు. రూరల్ ఎమ్మెల్యేది పబ్లిసిటీ స్టంట్ అనే విషయం అందరికీ తెలుసని చురకలంటించారు.

రోడ్ల నిర్మాణానికి వేగంగా భూ సేకరణ

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(అర్బన్): జాతీయ రహదారి నుంచి కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా రహదారుల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రెవెన్యూ, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులతో శనివారం ఆయన భూ సేకరణ ప్రక్రియపై సమీక్షించారు. ఫేజ్–3 కింద చేపట్టిన రహదారుల నిర్మాణాలకు సంబంధించి సేకరించిన భూములకు అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వడంలో ఎందుకు ఆలస్యం అవుతోందని అధికారులను ప్రశ్నించారు. ఆర్డీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ప్రక్రియనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ మలోల, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ గోవర్ధన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్, ముత్తుకూరు తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల వారీగా మంజూరైన పనులను అధికారులు పరిశీలించాలని కోరారు. పనులు అత్యంత వేగంగా జరగాలన్నారు. బిల్లులను సకాలంలో అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈలు అశోక్ కుమార్, రంగ వరప్రసాద్, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనికరం లేకుండా..

- ఆస్పత్రి నుంచి స్వగ్రామానికి వెళ్తూ ట్యాక్సీలో వ్యక్తి మృతి
- మృతదేహాన్ని దించేసి వెళ్లిపోయిన డ్రైవర్
- అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించిన పోలీసులు



ఆదినారాయణ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య శివలక్ష్మి

ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు): ఓ వ్యక్తి నెల్లూరులోని ఆస్పత్రికి వెళ్లి తిరిగి స్వస్థలానికి ట్యాక్సీలో బయలుదేరాడు. ఈ క్రమంలో గుండెపోటుతో మృతిచెందాడు. డ్రైవర్ ఏ మాత్రం కనికరం చూపకుండా మృతదేహాన్ని దింపేసి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అంబులెన్స్ ఏర్పాటుచేసి మృతదేహాన్ని స్వస్థలానికి పంపించారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఆదినారాయణ (46) ఆరునెలల క్రితం నెల్లూరులోని కిమ్స్ ఆస్పత్రిలో గుండెకు ఆపరేషన్ చేయించుకున్నాడు. శనివారం తన భార్య శివలక్ష్మితో కలిసి నెల్లూరుకు వచ్చి వైద్య పరీక్షల అనంతరం సొంతూరికి ట్యాక్సీలో బయలుదేరాడు. మర్రిపాడు వద్దకు చేరుకోగానే ఆదినారాయణకు ఆకస్మికంగా గుండెపోటు వచ్చి మృతిచెందాడు. నెల్లూరు నుంచి కిరాయికి వచ్చిన ట్యాక్సీ డ్రైవర్ తన వాహనంలో మృతదేహాన్ని తీసుకువెళ్లనని మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లోనే దించేసి వెళ్లిపోయాడు. ఓ వైపు తన చేతుల్లోనే భర్త కన్నుమూయడం, నడిరోడ్డుపై మృతదేహాన్ని దింపేయడంతో శివలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ విషయం తెలుసుకున్న మర్రిపాడు ఏఎస్సై శ్రీనివాసులురెడ్డి వివరాలు సేకరించి తక్షణమే అంబులెన్స్ మాట్లాడి మృతదేహాన్ని ప్రొద్దుటూరుకు పంపించారు.

న్యూస్‌రీల్


108, 104 నూతన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్యారోగ్య శాఖ ఆవరణలో 108, 104 వాహనాల నూతన కార్యాలయాన్ని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య శనివారం ప్రారంభించారు. ఇప్పటి వరకు 108, 104 కార్యాలయం పెద్దాస్పత్రి ఆవరణలో ఉండేదన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ దయాకర్, 108, 104 వాహనాల జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సోమశిలలో 52.544 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 52.544 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 361 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 250 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 303, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.765 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 338 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

కూరగాయల వ్యాపారం మాటున..

- గంజాయి విక్రయం
- ఐదుగురి అరెస్ట్



మాట్లాడుతున్న ఏఎస్పీ హిమవతి

నెల్లూరు(క్రైమ్): కూరగాయల వ్యాపారం మాటున గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న దంపతుల గుట్టును సెబ్ అధికారులు శనివారం రట్టు చేశారు. నెల్లూరులోని ఉమేష్ చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో ఏఎస్పీ డి.హిమవతి నిందితుల వివరాలను వెల్లడించారు. కరెంటాఫీస్ సెంటర్ గాయత్రీనగర్‌కు చెందిన షేక్ మాబాషా, జరీనా దంపతులు కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. వారికి తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలానికి చెందిన గంజాయి సరఫరాదారుడు షేక్ అబ్దుల్‌తో పరిచయం ఏర్పడింది. అబ్దుల్ నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో గంజాయి విక్రయిస్తుంటాడు. దంపతులు అతని వద్ద గంజాయి కొనుగోలు చేసి దానిని చిన్న చిన్న పొట్లాలుగా తయారుచేసి కూరగాయల దుకాణంలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి సొమ్ముచేసుకోసాగారు. ఏఎస్పీ ఆదేశాలతో సెబ్ పోలీస్ టీం ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా, సెబ్ నెల్లూరు–1 ఇన్‌స్పెక్టర్ కేపీ కిశోర్ తమ సిబ్బందితో కలిసి శనివారం కూరగాయల దుకాణంపై దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న మాబాషా దంపతులను, కొనుగోలు చేసేందుకు వచ్చిన ఇరగాళమ్మ సంఘానికి చెందిన పి.రాజు, చిన్నబజారు కామాటివీధికి చెందిన కె.కార్తీక్, సరఫరాదారుడి వివరాలు సేకరించి అతడిని సైతం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.లక్ష విలువ చేసే 5.340 కేజీల ఏ–గ్రేడ్ గంజాయి, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తొలిసారిగా వినియోగదారుల అరెస్ట్

ఏఎస్పీ మాట్లాడుతూ తొలిసారిగా గంజాయి వినియోగదారులను అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో ఆర్ఎస్సై గోపీనాథ్, ఎస్సై బాలకృష్ణ, సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో సెబ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కృష్ణకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పది ప్రధాన పరీక్షలు



నెల్లూరులో పరీక్ష రాసి బయటికొస్తున్న విద్యార్థులు - సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

నెల్లూరు(టౌన్): పదో తరగతి ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 172 కేంద్రాల్లో ఈనెల 3వ తేదీన ఎగ్జామ్స్ మొదలయ్యాయి. చివరిరోజు 27,595 మందికి గానూ 27287 మంది హాజరయ్యారు. డీఈఓ గంగాభవాని నాలుగు కేంద్రాలను పరిశీలించారు. కాగా ఈనెల 17న సంస్కృతం, అరబిక్, 18న ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయి. వీటికి కొద్దిమంది మాత్రమే హాజరుకానున్నారు.



పరీక్షలు ముగిసిన ఆనందంలో..



పేరెంట్స్ కోసం ఎదురు చూస్తూ..



పిల్లల కోసం పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న కుటుంబసభ్యులు

750 పొగాకు బేళ్ల కొనుగోలు



ఆత్మకూరు రూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 750 బేళ్లను రైతుల నుంచి కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ తెలిపారు. తిక్కవరం క్లస్టర్‌కు చెందిన రైతులు 826 బేళ్లను వేలానికి తీసుకొచ్చారన్నారు. వివిధ కారణాలతో 76 బేళ్ల తిరస్కరించినట్లు తెలిపారు. కిలో పొగాకుకు అత్యధికంగా రూ.200, అత్యల్పంగా రూ.174 నమోదైందని వెల్లడించారు.

21న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 21వ తేదీ ఉదయం పది గంటలకు జెడ్పీ కార్యాలయంలో జరుగుతాయని జిల్లా పరిషత్ సీఈఓ బి.చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పదిహేనేళ్ల తర్వాత మహాకుంభాభిషేకం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ముఖ్యఅతిథిగా పాల్గొననున్న కంచి కామకోటి పీఠాధిపతి
- వైభవంగా ఏర్పాట్లు చేస్తున్న జొన్నవాడ ఆలయ పాలకవర్గం, అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో దాదాపు పదిహేనేళ్ల తర్వాత మహాకుంభాభిషేక వేడుకలు నిర్వహించేందుకు అధికారులు, ఆలయ పాలకవర్గం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు నిర్వహించే ఈ కుంభాభిషేక వేడుకలకు భక్తులు తరలిరావాలని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభార్‌రెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి కోరారు. గతంలో 1969లో మొదటిసారి ఆలయంలో కుంభాభిషేక వేడుకలు నిర్వహించగా రెండోసారి 2008లో కంచి కామకోటి పీఠాధిపతులైన శ్రీ జయేంద్ర సరస్వతి, విజయేంద్ర సరస్వతి స్వాముల చేతులమీదుగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం కంచి కామకోటి పీఠాధిపతి అయిన శ్రీ విజయేంద్ర సరస్వతిస్వామి చేతులమీదుగా ఈ ఏడాది కుంభాభి షేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి ఆమె కుంభాభిషేక వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

భక్తులు తరలిరావాలి

దాదాపు 7 రోజులపాటు నిర్వహించే ఈ కుంభాభిషేక వేడుకలకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలిరావాలని ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలతోపాటు హైదరాబాద్‌కు చెందిన కొలన్ రాజారెడ్డి – పూజితమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ముందుకురావడం అభినందనీయమన్నారు.



వేడుకలకు సిద్ధమవుతున్న జొన్నవాడ ఆలయ గోపురం

కార్యక్రమాలు ఇవే

తొలిరోజు 27వ తేదీన గణపతి జమ హోమం, అనంతరం 28న మహా సంకల్పం, అంకురార్పణ, 29న దేవతా కళాకర్షణం, యాగశాల ప్రవేశం, లఘు పూర్ణాహుతి, 30న చండీ పారాయణ హోమం, మే 1వ తేదీ గణపతి పూజ, పుణ్యాహవాచనం, మూలమంత్ర హోమం, 2న జపహోమం, తత్వ హోమం, యాగశాల వేదిక పూజ, 3న మహా కుంభాభిషేకం, వెండినంది సేవ గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

ఎన్నికలు సమీపిస్తేనే ఎన్టీఆర్ పేరు స్మరిస్తారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- చంద్రబాబు తీరుపై ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శలు

కొడవలూరు: ఎన్నికలు సమీపిస్తేనే ప్రతిపక్షనేత చంద్రబాబు ఎన్టీఆర్ పేరును స్మరిస్తారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. శనివారం కొడవలూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో ఎన్టీఆర్ స్ఫూర్తితో తన శేష జీవితాన్ని ప్రజలకు అంకితం చేశానని చంద్రబాబు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్టీఆర్‌పై వైశ్రాయ్ హోటల్‌లో చెప్పులు వేయించి ఆయన్ను మానసికంగా హత్య చేసిన చంద్రబాబుకు ఇలా మాట్లాడే అర్హత లేదన్నారు. టీడీపీ సభ్యత్వ పుస్తకాలపై ఎన్టీఆర్ ఫొటోను తొలగించిన చంద్రబాబు ఆయనపై ప్రేమ ఒలకపోయడం విచారకరమని పేర్కొన్నారు. ప్రజలను దోచుకొనే తత్వం చంద్రబాబుకు తొలి నుంచే ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజారంజక పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆయన విమర్శలు చేయడం అర్థరహితమని పేర్కొన్నారు. సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీపీ గాలి జ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు ప్రతాప్, సర్పంచ్ కామాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, నాయకులు ఒట్టూరు సునీతమ్మ, నక్కా తిరుపతమ్మ, కె.నాగేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు, పి.రవి తదితరులు పాల్గొన్నారు.


శశి.. నా అనుచరుడు కాదు

- అసత్య ప్రచారాలను ఖండించిన మెట్టుకూరు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు రూరల్ పరిధిలో ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని మరణానికి కారణమని ఆరోపణలు ఎదుర్కొంటున్న శశి అనే డ్రైవర్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని, అతను తన అనుచరుడు కాదని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. శశి తన అనుచరుడు అంటూ కొంతమంది పనిగట్టుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అతనిది తన సొంత గ్రామం అయినప్పటికీ అతన్ని తాను ఏనాడు కలవలేదని తెలిపారు. మహిళలను గౌరవించడంలోనూ, విద్యార్థినులకు అండగా ఉండడంలోనూ తాను ఎప్పుడూ ముందుంటానని తెలిపారు. తప్పుడు పనులు చేసే వారికి ఎందుకు మద్దతిస్తానని ప్రశ్నించారు. తనపై తప్పుడు ప్రచారం చేసే వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- యువకుడి దుర్మరణం




ఘటనా స్థలంలో దినేష్ మృతదేహం

కావలి రూరల్: బైక్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న కుట్టుబోయిన దినేష్(23) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని రుద్రకోట వద్ద చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై ఎం.వెంకట్రావు వివరాల మేరకు రావూరుకు చెందిన రైల్వే కాంట్రాక్టర్ కుట్టుబోయిన దినేష్ తల్లి తులసమ్మ వద్ద ఉండేవాడు. పనుల నిమిత్తం కావలికి వచ్చి తిరిగి బైక్‌పై రావూరుకు వెళుతుండగా కావలి మండలంలోని రుద్రకోట వద్ద కావలి నుంచి ఒంగోలు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో దినేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ.77
సన్నవి: రూ.50
పండ్లు: రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్ : రూ.124
లేయర్ లైవ్ రూ.75
బ్రాయిలర్ చికెన్: రూ.220
స్కిన్‌లెస్ చికెన్: రూ.240
లేయర్ చికెన్: రూ.128

పునరావాస కేంద్రాల్లో పనులు వేగవంతం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(పొగతోట): పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్‌తో కలిసి ముత్తుకూరు మండలం నేలటూరు, నేలటూరుపాళెం, ఎస్సీకాలనీల వాసులు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. పునరావాస కేంద్రాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి నేలటూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించాలని, లబ్ధిదారుల అభ్యంతరాలు తెలుసుకుని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన వారి పేర్లను జాబితాలో చేర్చాలని, తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల కోసం మూడు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించామని, అందరికీ ఆమోదయోగ్యమైన స్థలాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. సమావేశంలో నెల్లూరు ఆర్డీఓ మలోలా, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిం దిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.